

# రెండు ప్రపంచాలు

సుప్రభ

మార్చినెల మధ్యాహ్నం. ఆ పూట క్లాసులు లేవు. యూనివర్సిటీ బిల్డింగ్‌లోనుంచి బయటకు వచ్చి బస్ స్టాప్ దగ్గర నుంచున్నాను. అమెరికాలో అరుదుగా కనిపించే సూర్యరశ్మి వెచ్చగా వుంది. అప్పుడే కొత్తచిగుళ్ళు పట్టిన చెట్లు పచ్చగా మిసమిస లాడుతున్నాయి. వసంతం అడుగు పెట్టినా, చలికాలానికి పూర్తిగా వదిలి పోబుద్ధికాలేదులా వుంది- గాలిలో చిరుచలి వెచ్చని సూర్యరశ్మి దాటి శరీరాన్ని తాకుతూంది.

విసుగ్గా వాచ్‌వంక చూసుకున్నాను. అక్కడికి వచ్చి అయిదు నిమిషాలే అయినా, అప్పటికి వాచివంక మూడు సార్లయినా చూసి వుంటాను. కబుర్లల్లో పడ్డప్పుడు క్షణాలుగా గడిచిపోతాయి

గంటలు. కాపలా దగ్గరకు వచ్చేసరికి కాలం స్తంభించిందా అన్నట్లుంటుంది.

సందు మొదలులో బస్సు కనిపించే సరికి తేలిగ్గా నిట్టూర్చాను. ఈరోజు ఎందుకో నా మనసు నా స్వాధీనంలో వుండదు. అది అబద్ధమని రుజువు చేయ డానికి నేను పడే తిప్పలు వృథా అని పోయిన రెండుమూడేళ్ళనుంచి తెలుస్తూనే వుంది. అందుకే చదవాల్సింది బోలె డున్నా లైబ్రరీకి వెళ్ళకుండా ఇంటి మొహం పట్టాను.

బస్సుదిగి యిల్లు చేరేసరికి, యిల్లు యథాప్రకారంగావుంది. నా ఆలోచనకు నేనే నవ్వుకున్నాను నిర్లిప్తంగా: ఆ చిన్న ఎపార్ట్‌మెంటులో వంటరిగాడిని, పొద్దున వదిలిపోయిన యిల్లు వదిలిన ట్లుండక యింకోలా ఎలా వుంటుంది! అనుకున్నాను. యిదేం స్వంత యిల్లు కాదుగా. తను యింటి దగ్గర వున్నప్పు డయితే తన రూమ్ ఎప్పుడు చూసినా హాయిగా, శుభ్రంగా కూచుని చదువుకో వాలనిపించేటట్లు వేటి స్థానంలో అవి వుండేవి. తను కాలేజికి పోగానే ఏదో ఒక సమయంలో హేమవచ్చి అన్నీ ఎక్కడివక్కడ సర్దివెళ్ళేది.


ఇక్కడ నా గది నాకు మామూలే! ఎప్పుడయినా ఏ విషయం మీదనయినా మనసుకు తోచినవి ఓ కాగితంమీద రాసి పెడ్తాను. మళ్ళీ మర్నాడు ఆ కాగితాన్ని వెతకాలంటే కనీసం ఓ రెండుగ్గంటలు వృథా అవవలసిందే. వారానికోరోజు తీరిక చేసుకుని ఎపార్ట్‌మెంటు అంతా సర్దుతూవుంటాను. కాని అదేం పాపమో గాని, సర్దినంత సేపు పట్టేదికాదు యథా స్థానానికి రావడానికి.

నాకు నా రూమ్ కొత్తగాదు. దాదాపు పద్దెనిమిది నెలలనుండి అక్కడే వుంటు న్నాను. కొన్నాళ్ళు ఇంకొక ఇండియన్‌తో కలసివున్నాను. మొత్తంమీద నాకు తెలియకుండానే ఈ వంటరి జీవితానికి యిష్టం కలగసాగింది.

అటూ, యిటూ ఏమీ తోచక తిరుగు తూంటే మనసు గతంలోకి పోతూంది. ఇంక ఇలా గాదని రిఫ్రిజిరేటర్ తెరిచి ఓ బీరు బాటిల్ తీసుకుని సోఫాలో కూర్చున్నాను. పక్కనే వున్న రికార్డ్ ప్లేయర్ పెట్టి అలాగే కూర్చుండి పోయాను.

మనసు పరిపరి విధాల పోసాగింది. మధ్య, మధ్య యింత అమూల్యమయిన సమయాన్ని యిలా వృథా పరుస్తున్నా నేమో అనిపించసాగింది. చదవాల్సింది వుంది. థీసిస్‌కు సమకూర్చుకోవలసిన మేటర్ పూర్తికాలేదు. ఏ పనీ చేయ కుండా యిలా గడుపుతున్నా నేమిటని నన్ను నేనే మందలించుకోబోయాను. కాని నాకు తెలుసు అంతగా ఫలిత ముండదని.

మూడేళ్ళక్రితం మార్చినెలలో యీ రోజు జరిగినదాన్ని నన్ను మరువ




నివ్వవు నా స్మృతులు. ఏదో జరిగి వుండాల్సిందని, జరిగినదాన్ని జరగకుండా ఆపలేకపోయానని నా మనసు తొలుస్తూనే వుంటుంది. కాని యిప్పుడు ప్రయోజనం లేదని తెలుసు. జరిగిన ప్రతిక్షణం చేయిజారిన గాజు ముక్కలాంటిది.

కాని......ఎందుకీ అసంతృప్తి వెన్నాడుతూంది? సృష్టిలో ఏర్పడిన భేదాలు సర్దుబాటు చెయ్యలేకపోయానన్న తపన నా ఒక్కడికే ఎందుకుండాలి? యీ భేదాల్ని చూచి నాకు కలుగుతున్నది తపనో? లేక నా వారికి అన్యాయం జరిగిందన్న ఆవేదనో, అసహ్యమో, మరేదో నాకే తెలియదు. నా భావాలకు రూపాన్ని నేనివ్వలేను.

సందిగ్ధంలో కొట్టుకుపోతున్న నాకు నా చేతిలోని బీర్ బాటిల్ ఖాళీ అయిందని తెలియలేదు. పక్కన ఆటోమేటిక్ రికార్డ్ ప్లేయర్ దానంతట అదే ఒక్కొక్క రికార్డే పడేసుకుని పాడేస్తోంది.

సీసా గార్బేజ్ బాగ్ (డస్ట్‌బిన్)లోకి విసిరేసి కిటికీకి దగ్గరగా వెళ్ళి నుంచున్నాను. బయట చిన్న పిల్లలు జోరుగా మూడుచక్రాల సైకిళ్లు తొక్కుతూ ఆడుకుంటున్నారు. వాళ్ళతోపాటు బయటకు వచ్చి తల్లులు కబుర్లు చెప్పుకుంటూ నుంచుని వున్నారు.

'బ్యూటిఫుల్. బ్యూటిఫుల్ బ్రౌన్ ఐస్' ఫ్రాన్సిస్ పాట చెవులోకి దూరింది. యధాలాపంగా అటు తిరిగి

పాట వింటూ నుంచున్నాను. బ్రౌన్ ఐస్, బ్లాండ్ హెయిర్ అనుకుంటూ వుంటె అప్రయత్నంగా సూసన్ గుర్తుకు వచ్చింది. మిలమిలా మెరిసే నీలికళ్లు, నున్నని గులాబి చెంపలు, నిగనిగలాడే మెడ వెనుక భాగాన్ని కప్పేస్తూ మెత్తగా జారిపోయే బ్లాండ్ హెయిర్. ఎందుకో తెలియకుండానే ఆమె మీదకు తీసుకు వెళ్లాయి ఆలోచనలు. కళ్ళనిండా తొణి కిసలాడే యాంబిషన్స్‌తో ఆరోగ్యంగా, ఉత్సాహంగా వుండే సూసన్‌ని గురించి ఆలోచిస్తూ వుండిపోయాను.

అమెరికాకు వచ్చి 18 నెలలయినా అలాంటి అమెరికన్ కుటుంబం నేను యింకొకటి చూడలేదు. వాళ్ళింటికి ఎప్పుడు వెళ్ళినా నేను అక్కడ పరాయి వాడినన్న భావన కలుగదు నాకు. మన సంతా ఆనందాన్ని నింపుకుని, జీవిత మంతా సంపూర్ణమయిన కోరికలు కూర్చు కుని, అవి తీర్చుకుంటున్న ఆ కుటుం బాన్ని చూస్తూవుంటే నాకు బంధువుల మధ్య వున్న భావనే వస్తుంది.

వెంటనే కూర్చున్న చోటినుంచి చటుక్కున లేచి టెలిఫోన్ దగ్గరకు వెళ్లాను. నెంబర్ చూచి అక్కడకు ఇరవై మైళ్ళ దూరంలోవున్న రాన్ టూల్‌కు ఫోన్ చేశాను. మిసెస్ విల్సన్ ఫోను ఎత్తింది. యీ వీకెండ్ మీరు బిజీగా వున్నారా అని అడిగాను. 'లేదు, పొలం పని వుంది' అన్నది. 'నేను మీ యింటికి వద్దామనుకుంటున్నాను, మీకు ఏ యితరమయిన యిబ్బందిలేకుంటే' అన్నాను.

"నోనో. మా కేమీ యిబ్బంది లేదు. తప్పకుండా రా! మనం కలిసి కూడా మూడు నెలలు దాటుతోంది. మళ్లీ యిది లైము కూడా!" అంది నవ్వుతూ. "ఇవాళ డేవిడ్ ఆ వూరు వస్తున్నాడు ఏవో వస్తువులు కొనడానికి. అటునుంచి మీ యింటికొచ్చి నిన్ను రిసీవ్ చేసుకుంటాడు," అంది.

"ఒ.కె." అని మూసేశాను. వెంటనే బయటకు వెళ్లాను ఏదయినా బహుమతి తీసుకు వెడదామని మిసెస్ విల్సన్‌కు పువ్వులంటే ప్రాణం. వాటిని అపురూప మయినవాటిలా యిల్లంతా అందంగా అమర్చుతూ వుంటుంది. పూలు కొందామని షాపుకు వెళ్ళాను. అంద మైన పూలను చూడగానే ఎందుకో మనసుకు మళ్లీ ఏదో తగిలినట్లనిపిం చింది. మా హేమకు గులాబులంటే ఎంతో యిష్టం. ఎప్పుడూ ఆ చెట్లదగ్గర కూర్చుని గొప్పులు తవ్వటమో, అంట్లు కట్టడమో చేస్తూవుండేది. అప్రయ త్నంగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి వెంటనే తమాయించుకుని, పూలుకొని, బాక్సులో పెట్టించుకుని యింటికి వెళ్లాను.

సాయంత్రం అయిదున్నర అయ్యే సరికి మిస్టర్ విల్సన్ వచ్చాడు. ఇద్దరం కలసి రాన్‌టూల్ వెళ్ళాం. రాన్‌టూల్

నేనున్న వూరుకు దాదాపు ఇరవై మైళ్ళ దూరంలో వున్న పల్లెటూరు. మిష్టర్ విల్సన్ కొంత టైము బయట పనిచేస్తూ యింటిదగ్గర స్వంత పొలంపని చూస్తూ వుంటాడు. నాలుగయిదు ఎకరాలస్థలంలో వాళ్ళిల్లు ఎత్తి పెట్టినట్లు కనుపిస్తూ వుంటుంది. ఇంటివెనక, ముందు రకరకాల కూరగాయలు మొక్కజొన్నలు బీన్సు వేస్తూంటారు. వాళ్ళకు స్ప్రింగ్ వచ్చిందంటే పొలం పనులతో తీరికే వుండదు.

నేను, విల్సన్ కలిసి కొన్ని వస్తువులన్ని లోపలకు చేరవేశాం. లోపలకు వెళ్ళగానే ఎదురుగావచ్చిన, మిసెస్ విల్సన్ కు నేను తెచ్చిన పూలు అందించాను. వాటిని ఆమె ఆనందంగా అందుకుంటున్నా, ఆపూట ఆమె ముఖంలో ఏదో కోల్పోయిందని, దేనికో చోటు చేసుకుందని స్పష్టంగా తెలిసింది.

వచ్చి అరగంటయినా ఆపూట సూసన్ కనుపించలేదు. నాకేమిటో ఆశ్చర్యమనిపించింది. ఎప్పుడూ నే వచ్చేసరికి వాకిట్లోనే ఎదురయి పలకరించే సూసన్ యీరోజు ఏమయిందని అనుకున్నాను.

ఆఖరికి డిన్నర్ టేబుల్ దగ్గరకూడా కనిపించకపోయేసరికి నాకిక మనస్సు వుండబట్టలేదు. యింక చివరకు అడిగాను ఆగలేక — "యివాళ సూసన్ కనిపించటంలేదు. యింట్లో లేదా?" అని.

'ఇంట్లోనేవుంది. ఒంట్లో ఎక్కువ బాగాలేదు' అంది మిసెస్ విల్సన్ ముభావంగా, తల కిందకు వాల్చుకుని. ఆమె మ్లానవదనం చూచాక యింకేమీ అడగలేక మౌనంగా భోజనం పూర్తి చేశాను. కాని ఆ పూటంతా ఏదో లోపం నాకు కనిపిస్తూనేవుంది. వాళ్ళకు నేనురావటం ఇబ్బందిగా ఉందేమో అనిపించింది. 'ఛ. వాళ్ళింటికి ఎన్నోసార్లు వెళ్ళాను. పోయిన రెండు క్రిష్టమస్లు వాళ్ళింట్లోనే గడిపాను. నేను అంత దగ్గరగా వచ్చిన కుటుంబం ఏదయినా వుంటే అదొక్కటే!' వాళ్ళకు నేను రావడం యిబ్బందిగా వుందేమో అన్నభావన నాకే సిల్లీగా తోచింది.

విల్సన్ కు ఒక్కతేఅమ్మాయి. తనకు పై చదువులు చదువుకునే అవకాశం ఎక్కువగా లేకపోవడంతో ఆయనకు పెద్ద చదువులు చదివేవాళ్ళంటే ప్రత్యేకమయిన అభిమానం. నేను ఎప్పుడెళ్ళినా నా చదువుగురించి శ్రద్ధగా విచారిస్తూ వుండేవాడు. సూసన్ బాగా చదవాలన్నదికూడా ఆయన కోరికే!

డిన్నర్ అవగానే లివింగ్ రూమ్ లో కూర్చున్నాం టెలివిజన్ చూస్తూ మధ్య మధ్య కబుర్లు చెప్పుకుంటూ. మిసెస్ విల్సన్ మాతోపాటు ఓ అరగంట కూర్చుని 'ఎక్స్ క్యూజ్ మి. నే నింక పడుకుంటాను' అని వెళ్ళిపోయింది.

నా కెంతో ఆశ్చర్య మనిపించింది. మే మెప్పుడు కలిసినా రాత్రి పదకొండు పన్నెండు గంటలదాకా కబుర్లేసుకుని కూర్చుంటాం. కాని యివాళ ఎందుకో...

నేను చాలా యిబ్బందిగా ఫీలయ్యాను. 'మీరూ బాగా టైర్ అయ్యారనుకుంటాను. యిక పడుకుందామా' అన్నాను.

'నొ. నొ. నేను బాగానే వున్నాను. కూర్చో కాసేపు కబుర్లు చెప్పుకుందాం' అన్నాడు విల్సన్.


కాని ఆయన మనసులోకూడా ఏవో నీలిమబ్బులు ముసురుకొన్నాయని గ్రహించడానికి ఆట్టేసేపు పట్టలేదు. అదేమిటో తెలుసుకోవాలన్న జిజ్ఞాస వున్నా, ఆ చనువు తీసుకునేందుకు సాహసించలేకపోయాను.

చివరకు చాలా సేపటికి, ఆయనలో ఆయనే తటపటాయించి నాకు అసలు విషయం చెప్పాడు. ఆ విషయం వినగానే తలమీద ఎవరో మోదిన ట్లనిపించింది. అసలు ఏం మాట్లాడాలో చాలా సేపు తెలియకుండా పోయింది. చివరకు అన్నాను. 'అయినా సూసన్ అదృష్టవంతురాలే! యిక్కడ పుట్టింది' అన్నాను, మాటలు పెగుల్చుకుని. ఆయన విచిత్రంగా చూశాడు నా వంక. నాదగ్గర ఆయనకు సమాధానం దొరకలేదు.

యింకో గంటసేపు అవి యివి మాట్లాడి, ఎవరిదోవన వాళ్ళం పెళ్ళి పడుకున్నాం. మెత్తటి మంచంమీద వాలిన నాకు ఒళ్ళంతా కంపరమెత్తసాగింది. ఎంత ప్రయత్నించినా మనసు స్వాధీనం లోకి రాలేదు.

సూసన్ ఈ రొంపిలోకి ఎలా దిగింది? ఎప్పుడుచూచినా చలాకీగా, హుషారుగా రకరకాల భావాలతో, ఎన్నో కోరికలతో కలలుకంటూవుండే సూసన్‌కు యిది ఎలా సంభవించింది? అనుకున్నాను బాధగా.

సూసన్‌లో నాకు యితర అమెరికన్ ఆడపిల్లలలోలేని ప్రత్యేకత కనుపించేది. అదేమాట ఆమెతో అన్నానుకూడా! చాలామంది అమెరికన్ ఆడపిల్లలు త్వరగా పెళ్ళిళ్ళు చేసుకుని జీవితంలో స్థిరపడిపోవాలన్న కోరికతో వుంటారు. కాని సూసన్ అలాకాదు. పై చదువులు చదవాలని, యూరప్, కాంటినెంట్ అంతా తిరిగి చూడాలని, ఏవేవో రకరకాల కోరికలు చెప్తూ వుండేది. 'నాకు పూర్తిగా సంసార జీవితంలో స్థిరపడా లని లేదు. మనకు దరిదాపుల్లో లేని విద్య ఎంతోవుంది. ఎన్నో చెయ్యాల్సినవి. చూడాల్సినవి వున్నాయి. వాటిలో కొన్న యినా చూడాలని, కొంతయినా తెలుసు కోవాలని వుంది' అనేది. 'యిల్లు సంసా రంకాక బయట ప్రపంచం చాలావుంది. అది కొంతవరకు అర్థం చేసుకోవాలి. ఒకసారి వైవాహిక జీవితంలో ప్రవేశించా నంటే యిక బయటకురావడం కుదరదు. అందుకనే నా యాంబిషన్ కొంతయినా తీరాకకాని వాటినిగురించి ఆలోచించ దలుచుకోలేదు' అనేది. ఆమెమాటలు ఆలోచిస్తూవుండేవాడిని. అందరికీ ఆమె




కున్నంత మాత్రం జ్ఞానవుంటే యీ దైవర్సుల సంఖ్యలో సగం తగ్గేవి అనుకునేవాడిని.

సూసన్ కోరికలకు, మిష్టర్ విల్సన్ చెప్పిన విషయాన్ని సమన్వయపరుచుకోలేకపోయాను.

ఇవాళ ఏదయితే మర్చిపోవాలని ప్రయత్నిస్తున్నానో అదే యింకో రూపంలోఎదురయింది 'ఏమిటీ వింత?.. ఎందుకిలా ప్రకృతి పగబట్టి స్త్రీని సాధిస్తోంది?' అనుకున్నాను బరువుగా.

కిందటిసారి క్రిష్టమస్‌కు వచ్చినప్పుడు సూసన్ కుటుంబంతోపాటు నేనూ వెళ్ళాను ఎయిర్‌పోర్టుకు, సూసన్‌కు వీడ్కోలు యివ్వడానికి. సూసన్, యింకా కొంతమంది స్నేహితులు కలిసి సెలవల్లో మయామి, ఫ్లారిడా మొదలయిన ప్రదేశాలు చూడటానికి వెళ్ళారు. నేనున్న భాగంలో డిసెంబర్ నెలలో చలి గడగడలాడిస్తూంటే, సూసన్ వాళ్ళు వెళ్ళిన వూళ్ళల్లో హాయిగా వెచ్చగా వుంటుంది. అక్కడ అందరూ కలిసి న్యూయియర్ ముందు రాత్రి పార్టీ చేసుకుంటూంటే యీ అవాంతరం జరిగింది. తత్ఫలితంగా సూసన్ తల్లికాబోతూంది.

ఈ విషయం విల్సన్‌ద్వారా వినగానే నాకు మతిపోయిందనిపించింది. ఇరవై ఏళ్ళ సూసన్‌కు కాలేజీ చదువులో

యింకా ఒక సంవత్సరం వుంది. యింకా యింకా ఎన్నో చదవాలని ఎదురు చూస్తున్న యీ వయస్సులో యీ అవాంతర మేమిటి? సూసన్ ఏం చేస్తుంది? తన ఖర్మ యింతే అని రాజీపడుతుందా? లేక ఎదురునిలచి సాధిస్తుందా? ఏం సాధిస్తుంది? తండ్రి లేకుండా, వివాహం అనే సంఘ ఆమోదముద్ర లేకుండా పిల్లను పెంచుతుందా? లేక ఎవరికన్నా యిచ్చేసి?...

ఇంక ఆలోచించే శక్తి లేకపోయింది. నా కళ్ళముందు యిద్దరువ్యక్తులు వదలకుండా మెదులుతున్నారు. నాతోపాటు రక్తం పంచుకుపుట్టిన చెల్లెలు హేమ. ఎంతో ఆత్మీయత చూపించిన స్నేహితురాలు. యిద్దరూ ఒకేసమస్యకు ఎదురయ్యారు. ఒకరు మగవాడి కబంధ హస్తాలక్రింద నలిగిపోతే, మరొకరు దైహిక బలహీనతకు లొంగిపోయారు. ఎన్నో ఆశలు సమకూర్చుకుని, అందమయిన జీవితంకోసం ఎదురు చూస్తున్నది ఒకరు; ఆశలన్నీ అడియాసలు అయి, బ్రతుకంతా మోడయిపోయి విలపించింది మరొకరు...

ఈ యిద్దరిని పోల్చకుండా వుండలేకపోయాను. ఒక్కక్షణం యీ యిద్దరిలో అదృష్టాన్ని వెతకబోయాను. నాకు దొరికింది ఏమీలేదు నిద్రలేని రాత్రితప్ప...

మెళకువ వచ్చేసరికి గదంతా తెల్లని వెలుతురుతో నిండిపోయింది. బట్టలు మార్చుకుని బయటకు వచ్చాను. చుట్టూ వున్న చెట్లమీదనుంచి వచ్చే గాలి మూలంగా అలసట అంతా తీరి ఫ్రెష్‌గా వున్నట్లనిపించింది. అయినా, కళ్లు ఎరుపెక్కి మండసాగాయి. క్రిందకు దిగి వచ్చేసరికి మిసెస్ విల్సన్ బ్రెక్‌ఫాస్టు టేబుల్ సర్దుతోంది. విల్సన్ సోఫాలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు. నన్ను చూడగానే పేపరు మడిచి పక్కకు పెడుతూ, 'గుడ్‌మార్నింగ్ షిరినివాస్' అన్నాడు.

'గుడ్‌మార్నింగ్' అన్నాను తిరిగి. నా గొంతుక మందంగా వినిపించింది— రాత్రి నిద్రలేకపోవడం వలనకాబోలు.

బ్రెక్‌ఫాస్టుదగ్గర సూసన్ కనిపించింది. నవ్వుతూ పలకరించింది. నేనూ పలకరించబోయాను. కాని ఎందుకో మామూలుగా లేననిపించింది.

తల వంచుకుని మౌనంగా, తినసాగాను; మధ్యమధ్య సూసన్‌వంక చూస్తూ. సూసన్‌కూడా పరధ్యానంగా వున్నట్లు తోచింది.

సూసన్‌ని చూస్తూవుంటే మా పరిచయమయినప్పటినుండి రకరకాల సంఘటనలు గుర్తుకు వచ్చాయి. సూసన్ సహజంగా చలాకీ అయినఅమ్మాయి. అందులో అమెరికన్ ఆడపిల్లలకు మనలా హద్దులు కూడావుండవు. ఇండియాలో మన పద్ధతులన్నీ వివరంగా అడిగి తెలుసుకుంటూ

వుండేది. సూసన్‌ని అన్నిటికంటె విపరీతంగా ఆశ్చర్యపరిచింది మన పెళ్ళి

'జీవితమంతా కలిసివుండాల్సిన ఇద్దరకు ఒకరినిగురించి ఒకరికి ఏమీ తెలియకుండా పెళ్ళేమిటి?' అనేది.

'అన్నీ తెలిసి చేసుకుంటున్న పెళ్ళిళ్లు మాత్రం ఏం సవ్యంగా వుంటున్నాయి?' ప్రశ్నించేవాడిని. కాని నా వాదన నాకే నచ్చేదికాదు ఒక్కొక్కప్పుడు. కేవలం సమర్థిస్తున్నానేమో అనిపించేది.

సూసన్‌తో మాట్లాడినప్పుడల్లా ఒక అనుమానం వెన్నంటి ప్రశ్నించేది: మన పెళ్ళిళ్లల్లో చాలాభాగం సరిగ్గానే వుంటాయి. యిందుకు కారణం ఏమిటి? ...సరిగా వున్నట్లు కనిపించేవాళ్ళు, నిజంగానే సుఖంగా వుంటున్నారా?... లేక గత్యంతరంలేక సర్దుకుపోతారా?... ఎన్ని వందలసార్లు ఆలోచించినా నాకు సమాధానం తోచేదికాదు.

బ్రెక్‌ఫాస్టు అయ్యాక యిద్దరూ చర్చికి బయలుదేరారు. నన్నూ రమ్మనమన్నారు. నాకు పెద్దగా విగ్రహారాధన మీద నమ్మకంలేదు. అందుకనే వాళ్లు రమ్మనమన్నప్పుడల్లా వెళ్ళివచ్చేవాడిని. అక్కడ చర్చిలో వున్నంతసేపు ఎలా టైము గడిచిపోయేదో తెలిసేదికాదు.

ఆ పూట మామూలుగా నేనూ బయలుదేరాను. కాని సూసన్ రానంది. మరేమీ మాట్లాడకుండా వాళ్ళిద్దరూ వెళ్ళేందుకు సిద్ధమవసాగారు. సూసన్‌కు కంపెనీగా వుందామని నేనూ యింట్లోనే వుండిపోయాను.

కొంతసేపు మా యిద్దరిమధ్య కొన్ని క్షణాలు మౌనంగా దొర్లిపోయాయి.

"హౌ ఆర్ యు షిరినివాస్ హౌ యీజ్ ఎవ్విరితింగ్ విత్ యు" అంది.

సూసన్ అంత ఫార్మల్‌గా మాట్లాడేటప్పటికి నాకేమిటోగా అనిపించింది. 'ఇండియన్ పేర్లకు సామాన్యంగా అర్థాలు వుంటాయటగా. నీ పేరుకు అర్థమేమిటని అడిగింది ఒకసారి. నాకు తోచిందేదో చెప్పాను. అప్పటినుండి రిచ్‌మాన్ అనో ట్రెషర్ హౌస్ అనో పిలుస్తూ జోక్ చేస్తూవుండేది.

ఎప్పుడూ ఏదో హాస్కు వేసుకుని కూర్చునే మాకు ఆరోజు మాటలే కరువయ్యాయి. చివరకు యిద్దరం బయటకు వెళ్ళాం. వాతావరణం చాలా బావుంది. అప్పుడే సూర్యుడు కొద్దిగా వేడెక్కుతున్నాడు. విల్సన్ పొలంలో పని ఆ సంవత్సరం అట్టే చురుగ్గా సాగుతున్నట్లు కనుపించలేదు. అదే మాట అన్నాను సూసన్‌తో. నవ్వి వూరుకుంది.

"బాగా అలసినట్లు కనుపిస్తున్నావు. రాత్రి నిద్రపట్టలేదా?" అడిగింది సూసన్.

మౌనంగా తల వూగించి వూరుకున్నాను. నాకు సూసన్‌తో ఏదో మాట్లాడాలనివుంది మనసులో. సూసన్‌కుకూడా మాట్లాడాలనిపించిం దనుకుంటాను. కాని మా యిదరిలో ఏ ఒక్కరికిసంభాషణ ఎలా

మొదలుపెట్టాలో తెలియక, చాలాసేపు అవీయివీ మాట్లాడుతూ కూర్చున్నాం.

"ఏంచేద్దా మనుకుంటున్నావు యీ సంవత్సరం?" అన్నాను యధాలాపంగా.

కొద్దినిమిషాలు మాట్లాడలేదు. "స్టూలు మానేస్తా ననుకుంటున్నాను యీసంవత్సరం" అంది మందంగా.

అర్థంకానట్టు చూశాను.

'పరిస్థితి నీకు తెలిసేవుంటుంది,' అంది ఎటోచూస్తూ.

ఏం సమాధానం యివ్వాలో తెలియని వాడిలా వుండిపోయాను. "పెళ్ళి చేసుకోవడానికి యిష్టపడలేదా?" అన్నాను చాలా సేపటికి.

"ఎవరూ?" అంది అయోమయంగా.

ఆశ్చర్యంతో చూశాను అర్థంకాక.

కొద్దిక్షణాలు మౌనంగా గడిపి అంది. "ఒకసారి చేసిన పొరపాటును దిద్దుకుందామని, యింకో పొరపాటు చెయ్యమన్నావా?"

కర్తవ్యం తోచలేదు. "మరి ఏంచేద్దామనుకుంటున్నావు?" అన్నాను చివరకు.

"ఏమో! యింకా నిశ్చయంగా తెలియదు. పెళ్ళిగాని తల్లుల నర్సింగ్ హోమ్‌కు వెడతానేమో!"

"అతనికీ విషయం తెలుసా?" అడిగాను జిజ్ఞాసతో.

"ఇప్పుడు తెలియకపోయినా, ముందుముందు తెలుస్తుంది. కాని అందువల్ల పెద్దప్రయోజనం ఏముంది?" అంది నిర్లిప్తంగా.

"పెళ్ళి చేసుకుని వుండచ్చుగా!" అన్నాను నా ధోరణిలో నే సాగిపోతూ.

"అందువల్ల ఒక సమస్యను వారిస్తున్నా మనుకుంటూ మరోసమస్యకు అవకాశ మిస్తున్నామన్నమాట. మా యిద్దరికి పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశంలేదు. యిప్పుడు పరిస్థితుల మూలంగా..."

"పెళ్ళనేది అయితే ఒకరిమీద ఒకరికి యిష్టం కలుగుతుందేమో!"

"అది కాదుకదా యిప్పుడు సమస్య. అతనంటే యిష్టం, అయిష్టం అన్న ప్రశ్నేలేదు. నేను యింతమటుకు అసలు పెళ్ళి, సంసారంగురించి ఆలోచనే చేయలేదు. నాకసలటువంటి ఉద్దేశమేలేదు. అటువంటిది పరిస్థితులతో రాజీపడి అసంతృప్తిగా అందులో జొరపడితే ఎవరికీ సుఖ ముంటుందనుకోను. అసంతృప్తితో మే మిద్దరమూ ... మా యిద్దరకు మధ్య పెరిగే బిడ్డకుమాత్రం ఏం మంచి జరుగుతుంది?" అంది నిశ్చలంగా.

మబ్బులుకమ్మిన ఆమె ముఖాన్ని చూచే ధైర్యంలేక వూరుకున్నాను. ఆమె మనోనిబ్బరానికి, ధైర్యానికి ఎంతయినా ఆశ్చర్యం కలిగింది. రకరకాల భావాలు చుట్టుముట్టూవుంటే, తటస్థంగా నిలబడిపోయాను. సూసన్‌గురించి రేగే ఆలోచనలకు ఒకరూపం ఏర్పడలేదు.



ఎంత తేడా? యిదే జీవితసమస్య. ఎందరిని ఎన్నివిధాలుగా ఎదుర్కొంటోంది. ఎందరికి ఎన్నిరకాలుగా అంతమవుతోంది? ఎలాంటి దుస్థితి ఏర్పడ్డా నిర్భయంగా నిలబడి, కనీసం తిరిగి సంఘంలో నిలచేందుకు శక్తి వుంది సూసన్‌కు. పెంపకానికి వెళ్ళినా, 'మా అమ్మ, నాన్న! నా యిల్లు' అంటూ గౌరవంగా పెరిగే అవకాశం వుంది బిడ్డకు. కాని...యిదే పరిస్థితిలో...హేమ...

"ఇలాంటి పరిస్థితిలో యిరుక్కున్న నన్ను చూచి ఒక స్టుపిడ్ అనుకుంటూ వుండివుంటావు" అంది సూసన్ నిశ్శబ్దంగా, ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుపోతున్న నన్ను చూచి.

ఆమెవంక వెర్రిగా చూశాను ఒక

క్షణం. "నిన్నుగురించి ఏమనుకుంటు న్నానో తెలుసా సూసన్?" ఆగాను ఒక నిముషం. "నీ జీవితంలో యింత చెడు జరిగినా నువ్వు అదృష్టవంతురాలివే అను కుంటున్నాను" అన్నాను తగ్గుస్థాయిలో.

ఎగురుతున్న పక్షులవంక చూస్తూ నిలబడిపోయింది. నేనేదో జోక్ చేస్తున్నా నన్నట్లు చూసి, "అదృష్టవంతురాలినా? ...జీవితంలో ఎన్నో చెయ్యాలని ఆశిం చాను. ఏవేవో సాధించాలని అను కున్నాను. అనుకోని విధంగా యీ అంత రాయం కలిగింది. బహుశ నేను అను కున్నదానికంటే ఓ రెండేళ్ళు ఆలశ్యంగా నేను కోరినవి చెయ్యగలనేమో! కాని యీ దుస్సంఘటన నన్ను వెంటాడు తూనే వుంటుంది. ఈ ఓటమి నన్ను పరిహసిస్తూనే వుంటుంది. నేను అదృష్టవంతురాలినని ఎన్నడూ అను కోను. నా జీవితంలో నాకు పెళ్ళి, సంసారం, పిల్లలూ కావాలి. కాని ఇలా కాదు- వాటినినేను మనస్ఫూర్తిగా కోరిన నాడు, వాటి అవసరం నాకున్నదని నేను నమ్మిననాడు..." అంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆమెతో ఏవేవో చెప్పాలనిపించింది నాకు.

"సూసన్... నేను నిన్ను అదృష్ట వంతురాలివి అన్నప్పుడు నిన్ను పరిహ సిస్తున్నాననుకుని వుంటావు. కాని కాదు. నిన్న నేనిక్కడకు ఎందుకొచ్చానో తెలుసా?" అన్నాను.

మాట మార్చాలనుకున్నా ననుకున్న ట్లుంది. "నీ దేశంమీదకు మనసు పోయి వుంటుంది" అంది నవ్వాలని ప్రయ త్నిస్తూ.

"ఒక విధంగా నిజమే! నిన్నటి రోజును మర్చిపోవాలని ఎన్నాళ్ళగా ప్రయత్నిస్తున్నానో నీకు తెలియదు. ఎంత వద్దనుకున్నా, ప్రతి సంవత్సరం గుర్తుకురావడం, మనసు పాడవడం జరుగుతూనేవుంటుంది. నిన్ననామనసంతా చెడిపోయింది.ఏవేవోజ్ఞాపకాలుమనస్సును తవ్వసాగాయి. ఎక్కడికయినా వెడితే తప్ప బాగుండదనిపించింది. అందుకే నిన్న ఇక్కడకు వచ్చాను. కాని నిన్న ఈ సంగతి విన్నాక, నే నేదయితే మరవా లనుకుంటున్నానో అదే ఎదుటికి వచ్చిం దనిపించింది. కాని నేను మరవాలనుకునే సంఘటనకు, యిప్పుడు ఎదురయిన పరి స్థితికి సహస్రాంతం తేడా వుంది. అందుకే అన్నాను నువ్వు అదృష్టవంతు రాలివని.

నాకు ఓ చెల్లెలు వుండేది. బహుశా నీ వయసే వుండివుండేదనుకుంటాను. మా దేశం ఎన్ని విషయాలలో అభివృద్ధి చెందుతున్నా ఆచారాలు, అలవాట్లలో మాత్రం యింకా వెనకబడేవుంది. మా కుటుంబంకూడా పాత ఆచారాలను వదల కుండా అనుసరిస్తూనే వుండేది. ఆ కార ణంగానే మా చెల్లెలికి 13 ఏళ్ళప్పుడు మా అత్త కొడుకుతో పెళ్ళి జరిగింది..."

"కజిన్‌తోనా పెళ్ళి?" అంది ఆశ్చ ర్యాన్నంతా కళ్ళల్లో ఇనుమడింప చేస్తూ.

చిన్నగా నవ్వాను, ఆమె ఆశ్చర్యానికి. "మా వైపు అది యింకా చాలా మామూలు. బంధువులలో పెళ్ళిళ్ళు జరుగుతూనే వుంటాయి... దురదృష్ట వశాత్తు నాలుగు నెలలు తిరగకుండానే మా బావ చనిపోయాడు."

"అంటే మీ చెల్లెలికి వైవాహిక జీవితం గడిపే అవకాశమే కలగలేదన్న మాట," అంది సానుభూతిగా.

"మా దేశంలో అలాటివాళ్ళ బ్రతుకంతా చీకటే! అంతకీ నేను మా నాన్నతో అంటూనే వుండేవాడిని మళ్ళీ పెళ్ళి చేద్దామని. కాని పాత పద్ధతులు, ఆచారాలను గాఢంగా నమ్మే ఆయనకు, ఈ పని యిష్టం వుండేదికాదు. మా వాదనలు జరుగుతూండగానే మూడేళ్ళు జరిగిపోయాయి. నా డిగ్రీ వచ్చింది. ఉద్యోగంలో చేరాను. ఒకసారి మార్చినెలలో ఒక వారం రోజులు శలవు తీసుకుని యింటికి వెళ్ళాను.

నేను వెళ్ళేసరికి మా అమ్మా, నాన్న చాలా కృంగిపోయినట్లు కనుపించారు. నే నెప్పుడు వెళ్ళినా ఎదురొచ్చే మా చెల్లెలు వునికి తెలియలేదు. దూర దూరంగా తిరుగుతున్న మా అమ్మను చూసి యిక అడగలేక అడిగాను, ఏమైందని? మా అమ్మ అసలు విషయం చెప్పి గుండె పగిలేలా ఏడ్చింది. మా యింటి చుట్టుపక్కల ఎవరో అబ్బాయి అద్దెకు వచ్చాడట. అతను మెల్లిగా మా చెల్లెలికి మంచి మాటలు చెప్పి మోసగించాడు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించాడు.

ఈ విషయం విన్న నాకు మతి పోయినట్లయింది. ఎలాగయినా ఆ అబ్బాయిని వెతికి పట్టుకుని, పెళ్ళి జరిపించాలని నిశ్చయించుకున్నాం. చివరకు ఆ అబ్బాయి దొరికినా పెళ్ళి జరిపించడం సాధ్యం కాలేదు. బ్రతిమాలినా, భయపెట్టినా దేనికీ లొంగలేదు అతను. ఆఖరికి మా నాన్నకున్న ఆస్తంతా ఇచ్చయినా పెళ్ళి చెయ్యాలని నిశ్చయించుకున్నాం. అదీ కుదరలేదు. ఆ క్షణంలో అంత యిష్టం లేకుండా బలవంతాన పెళ్ళి జరిపిస్తే మా చెల్లెలు సుఖపడుతుందా అన్న ఆలోచన మాకు కలగనే లేదు. దీని అంతటికీ ఒకటే కారణం – ఎలాగో అలా పెళ్ళి జరిపించేస్తే, పాత తప్పిదాన్ని కప్పి, మా పరువుప్రతిష్ఠల్ని మా చెల్లెలి జీవితాన్ని నిలపడానికి వీలవుతుంది.

ఇక ఆఖరి ప్రయత్నంగా డాక్టర్‌కు లంచం యివ్వడానికి నిర్ణయం చేశాం... కాని అది జరిగేలోపలే దాని జీవితం ఆఖరయింది. అలాంటి స్త్రీకి సంఘంలో స్థానం లేదని తెలుసుకునేందుకు ఎక్కువ

సేపు పట్టలేదు. అలాంటి దుస్థితిని ఎదు ర్కొనే శక్తిలేక అక్కడికక్కడే జీవితం అంతం చేసుకున్న అభాగ్యు రాలు మా చెల్లెలు.

ఇది జరిగి మూడు సంవత్సరాలు దాటింది. కాని మర్చిపోవడం అనేది జరుగుతుందని అనుకోను. ఇలాంటి పని చేయడం అనేది ఎటువంటి సొసైటీలో నయినా తప్పే! కాని దిద్దుకోదల్చుకున్న వాళ్ళకు అవకాశమే వుంటే...

నిన్ను నేను సమర్థించినట్లు, మరొ కరు సమర్థించలేరు. నేనయినా మరో పరిస్థితిలో యీ పనిని అసహ్యించుకునే వాడినే! బాధను అనుభవించినవాడే బాధను అర్థం చేసుకోగలడు. ఒక అన్యా యానికి బలి అయినవారే, ఆ అన్యాయం జరగకుండా వుండాలని కాంక్షిస్తారు," అంటూ సూసన్ ముఖం వంక చూశాను. ఆమె నీలి కన్నులు నీళ్ళతో మిలమిలా మెరవసాగాయి.

"షిరినివాష్! ఈ దుర్ఘటనే జరగ కుండా వుండివుంటే ఏమయివుండేది?" అంది ఎటో చూస్తూ సుదీర్ఘంగా నిట్టూర్చి.

"ఏమో మా నాన్న నా మాట విని వుంటే, పెళ్ళి జరిగేదేమో? లేకుంటే మా తోనే వుండేది జీవితాంతం."

చాలా సేపు మా యిద్దరి మధ్యా నిశ్శబ్దం ఆవరించింది. సూసన్ వైపు రెండు మూడుసార్లు చూశాను యధాలా పంగా. కాని ఆమె మనసు ఎక్కడెక్కడో విహరిస్తున్నట్లు గ్రహించగలిగాను. మధ్య, మధ్య పక్షుల కిలకిలలు, చెట్లగాలికి వస్తున్న సవ్వడులు తప్ప మరే యితర శబ్దమూ లేదు.

"థాంక్యూ షిరినివాస్, థాంక్యూ" అంది చాలా సేపటి తరువాత మెల్లిగా.

ఆశ్చర్యంగా ఆమెవంక చూశాను. "ఎందుకు?"

"యు మేడ్ మి ఫీల్ బెటర్. ఐ గెస్ యు రైట్ ఆఫ్టరాల్, అయామ్ ఎ లక్కీ పర్సన్," అంది చిరునవ్వుతో. ఆమె కళ్ళనిండా వున్న నీళ్లు జలజలా రాలిపడ్డాయి.

